సాక్షి పల్నాడు

బుధవారం । 9 । జూలై । 2025



పేకాట స్థావరంపై దాడి

నగరం: వెలమవారిపాలెంలో పేకాట స్థావరం పై దాడిచేసి, 9 మందిని అదుపులోకి తీసుకుని, రూ.25,670లు స్వాధీనం చేసుకున్నామని రేపల్లె డీఎస్పీ ఎ.శ్రీనివాసరావు తెలిపారు.



సమస్యల పరిష్కారంపై సమీక్ష

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారం లక్ష్యంగా జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే కలెక్టరేట్‌లో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు.

అభయాంజనేయుడికి ప్రత్యేక పూజలు



భట్టిప్రోలు: పెదపులివర్రు గ్రామ పంచాయతీ పరిధిలోని గాజులపేటలో కొలువైన అభయాంజనేయ స్వామి వారికి మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

గురువులను పూజించాలి



అమరావతి: ప్రపంచాన్ని సన్మార్గంలో నడిపించి అందరికీ మార్గదర్శకంగా నిలిచే గురువులను పూజించాలని భవఘ్నిగురూజీ అన్నారు. మండల పరిధిలోని వైకుంఠపురం భవఘ్ని ఆరామంలో గురుపూర్ణిమ మహోత్సవాల తొలిరోజు మంగళవారం కార్యక్రమాలను భక్తిప్రపత్తులతో నిర్వహించారు. భవఘ్ని గురూజీ మాట్లాడుతూ ప్రపంచంలో ఎక్కడా లేనటువంటి ఆధ్యాత్మిక జ్ఞాన సంపద భారత దేశం సొంతమన్నారు. ఋషులు, మునులు, గురువులు మనకు అందించిన మహోన్నతమైన జ్ఞాన సంపదను సామాన్యునికి సైతం అర్థమయ్యే రీతిలో బోధించే గురువులను స్మరించుకోవటం అదృష్టంగా భావించాలన్నారు.. తొలుత మంగళవారం ఉదయాన్నే వ్యాస భగవానులకు సుప్రభాతసేవ, వ్యాసభగవానుడి ఉత్సవమూర్తికి రథోత్సవం, అనంతరం ఆదిగురువు వ్యాస భగవానుడికి ప్రత్యేకపూజలు నిర్వహించారు.

'నూటా' ఎన్నికల నోటిఫికేషన్ రద్దు



ఏఎన్‌యూ: నూటా (ఆచార్య నాగార్జున యూనివర్సిటీ అధ్యాపక సంఘం) ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసిందని ఆచార్య కె.సుమంత్ కుమార్, ఆచార్య ఎం.జగదీష్ నాయక్ తెలిపారు. కోర్టు ఆదేశాల మేరకు నూటా ఎన్నికల నోటిఫికేషన్ రద్దు చేయాలని కోరుతూ ఎన్నికల అధికారి ఆచార్య ఎస్.మురళీమోహన్‌కు మంగళవారం వారిరువురూ వినతిపత్రం సమర్పించారు. ఎన్నికల నోటిఫికేషన్, ఎన్నికల ప్రక్రియలోని లోపాలపై తాము హైకోర్టును ఆశ్రయించామని తమ పిటీషన్‌పై మంగళవారం వాదనలు విన్న హైకోర్టు న్యాయమూర్తులు నూటా ఎన్నికల కోసం ఈనెల 1వ తేదీన జారీ చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు.

ఏఎన్ఎంలకు బదిలీ కౌన్సెలింగ్

గుంటూరు మెడికల్: గుంటూరు డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో మంగళవారం ఏఎన్ఎంలకు సాధారణ బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. నాలుగు రోజుల కిందట నిర్వహించిన కౌన్సెలింగ్‌పై పలు ఆరోపణలు, ఫిర్యాదులు వచ్చాయి. దీంతో తిరిగి జూమ్ ద్వారా కౌన్సెలింగ్ నిర్వహించారు. సుమారు 900 మందికి పైగా వార్డు సచివాలయ ఏఎన్ఎం గ్రేడ్-3 కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. ఈ ప్రక్రియ అర్ధరాత్రి వరకు కొనసాగింది.

గణపవరం ఆలయంలో చోరీ



నాదెండ్ల: గణపవరం శ్రీ రుక్మిణి సత్యభామ సమేత సంతాన వేణుగోపాలస్వామి ఆలయంలో సోమవారం రాత్రి భారీ చోరీ జరిగింది. ఎస్ఐ జి.పుల్లారావు తెలిపిన వివరాల మేరకు మంగళవారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో ఆలయం వద్దకు వచ్చిన పూజారి చంద్రశేఖర్ ఆలయం ఇనుప గ్రిల్స్ ధ్వంసం చేసి ఉండటం గుర్తించి, పోలీసులకు సమాచారమివ్వటంతో రూరల్ సీఐ సుబ్బానాయుడు, ఎస్ఐ పుల్లారావులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. నాలుగున్నర కిలోల వెండి కిరీటాలు, శంకు చక్రాలు, 20 గ్రాముల బంగారు మంగళసూత్రాలు, హుండీలో సుమారు రూ.10 వేల నగదుతో కలిపి మొత్తం రూ.5-6 లక్షల మేరకు సొత్తు చోరీ జరిగిందని ఆలయ ధర్మకర్త శరవణ్ తెలిపారు.

రెండవ సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

ఏఎన్‌యూ: ఏఎన్‌యూ పరిధిలో పీజీ ఆర్ట్స్, సైన్స్, కామర్స్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంపీఈడీ, బీపీఈడీ, బీఈడీ తదితర కోర్సుల రెండవ సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 31, ప్రకాశం జిల్లాలో రెండు పరీక్ష కేంద్రాలలో పరీక్షలు జరుగుతున్నాయి. యూనివర్సిటీ పీజీ, ప్రొఫెషనల్ కోర్సుల పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎం.సుబ్బారావు మంగళవారం యూనివర్సిటీ పరీక్షా కేంద్రంలో పరీక్షల నిర్వహణను పరిశీలించారు.



వైఎస్సార్ జయంతి సందర్భంగా సత్తెనపల్లిలోని మొల్లమాంబ వృద్ధాశ్రమంలో అన్నసంతర్పణ చేస్తున్న డాక్టర్ గజ్జల సుధీర్ భార్గవ్‌రెడ్డి



వినుకొండలో రక్తదాతకు గుర్తింపు కార్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు



పిడుగురాళ్ల మండలం జానపాడు గ్రామంలో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి, రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి డాక్టర్ అశోక్‌కుమార్

మహానేత.. మనసాస్మరామి

- వాడవాడలా వైఎస్సార్‌కు ఘననివాళులు
- విగ్రహాలకు పూలమాలలు, రక్తదాన శిబిరాలు, అన్నదానం నిర్వహణ
- హాస్పిటళ్లలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ
- మాచర్లలో వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ ర్యాలీ

సంక్షేమ రేడు.. పేదల దేవుడు.. అభివృద్ధి ప్రదాత.. ఆరోగ్య దాత.. మహానేత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలు జిల్లావ్యాప్తంగా వైభవంగా జరిగాయి. పల్లె, పట్టణం అనే తేడాలేకుండా.. ఊరు వాడా.. భేదం లేకుండా వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు స్వచ్ఛందంగా వేడుకలు నిర్వహించారు. వైఎస్సార్ నిలువెత్తు విగ్రహాలకు పూలమాలలు వేసి, క్షీరాభిషేకాలు చేసి అభిమానం చాటుకున్నారు. కేకులు కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు. అన్నదానం.. రక్తదానం.. పేదలకు దుస్తుల పంపిణీ.. వైద్య శిబిరాలు వంటి పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి, రాజన్నా.. నిను మరువలేమన్నా.. అని స్మరిస్తూ.. వైఎస్సార్‌పై తమ గుండెల్లోని ప్రేమను వ్యక్తం చేశారు.

నరసరావుపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని జిల్లావ్యాప్తంగా వైఎస్సార్ సీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో పార్టీ జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు.

జిల్లా కార్యాలయంలో రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో నాయకులు, కార్యకర్తలు రక్తదానం చేశారు. అంధుల పాఠశాలలో అంధులకు అన్నదానం చేశారు. వినుకొండరోడ్డులోని రెడ్డి హాస్టల్‌లో మహానేతకు ఘనంగా నివాళులర్పించి అన్నదానం చేశారు. పార్టీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర కార్యదర్శి పడాల చక్రారెడ్డి, రైతు విభాగ జిల్లా కార్యదర్శి అన్నెంపున్నారెడ్డి, ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర కార్యదర్శి ఇయం.స్వామి, సోషల్ యాక్టివిస్టు ఈదర గోపీచంద్, జిల్లా కార్యదర్శి ఎస్.సుజాతాపాల్, పార్టీ శ్రేణులు పెద్దసంఖ్యలో ఉత్సాహంగా ర్యాలీగా పాల్గొన్నారు.

- చిలకలూరిపేటలో భాస్కర్ సెంటర్‌లో మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి విడదల రజని నివాస ప్రాంతంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కేకు కటింగ్ చేశారు. పలు వార్డుల్లో విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించి కేకులు కట్‌చేశారు. పార్టీ టౌన్ అధ్యక్షుడు షేక్ దరియావలి, చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండల అధ్యక్షులు దేవినేని శంకరరావు, మంగు ఏడుకొండలు, వడ్డెపల్లి నరసింహారావు, జిల్లా యువజన విభాగ అధ్యక్షులు కందుల శ్రీకాంత్, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

జిల్లాలో ఘనంగా వైఎస్సార్ జయంతి



నరసరావుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి

- వినుకొండ పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. రక్తదానం శిబిరంలో పలువురు రక్తదానం చేశా రు. ప్రభుత్వ హాస్పిటల్‌లో రోగులు, బాలింతలు, పిల్లలకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఏనుగుపాలెంరోడ్డు, ముండ్లమూరు బస్టాండ్ వద్ద నున్న వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, పేదలకు అన్నదానం చేశారు. యోగివేమారెడ్డి సేవాసంఘ ఆధ్వర్యంలో పట్టణంలోని వెల్లటూరు రోడ్డులో సంఘ కార్యాలయం వద్ద వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళులర్పించారు. అన్నదానం చేశారు. ఎంపీపీలు జయశ్రీ వెంకటరామిరెడ్డి, మేడం జయరామిరెడ్డి, అమ్మిరెడ్డి అంజిరెడ్డి, సూరాబత్తుని రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

- పెదకూరపాడు నియోజకవర్గంలోని ఐదు మండలాలు, గ్రామాల్లో పెద్దఎత్తున వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహించారు. క్రోసూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డి, పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు.లగడపాడు గ్రామంలో ముస్లిం యూత్ గ్రామపార్టీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.
- మాచర్ల నియోజకవర్గంలో రెంటచింతల మండలం, దుర్గి, కారంపూడి, వెల్దుర్తి, మాచర్లరూరల్, పట్టణంల్లో వైఎస్సార్‌కు నివాళులు అర్పించారు.

మాచర్ల పట్టణంలో యువజన విభాగం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జమ్మలమడకలో జరిగిన జయంతి కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు.

- సత్తెనపల్లి నియోజకవర్గం కార్యాలయంలో మహానేత వైఎస్సార్ విగ్రహానికి సమన్వయకర్త డాక్టర్ గజ్జల సుధీర్‌భార్గవరెడ్డి పూలమాలలు వేసి నివాళులర్పించి కేకు కట్‌చేశారు. అక్కడే ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. తాలూకా సెంటర్, గ్రంథాలయం, 13, 16, 19 వార్డులు, రైల్వేగేటు వద్ద వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. ఏరియా వైద్యశాలలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆదరణ, మొల్లమాంబ వృద్ధాశ్రమం, పరివర్తన ఆశ్రమ పాఠశాలలో కేకులు కట్‌చేసి అన్నసంతర్పణ చేశారు. రెంటపాళ్ల, కంటిపూడి, కొమెరపూడిల్లో వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించారు. అన్నసంతర్పణ చేశారు. ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో వైఎస్సార్ జయంతి వేడుకల్లో డాక్టర్ గజ్జల పాల్గొన్నారు. పక్కాల సూరిబాబు, చల్లంచర్ల సాంబశివరావు, డాక్టర్ గజ్జల నాగభూషణరెడ్డి, షేక్ నాగూర్‌మీరాన్, రోళ్ల మాధవి పాల్గొన్నారు.

- గురజాల నియోజకవర్గంలో పిడుగురాళ్లలో మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి పాల్గొని మహానేత డాక్టర్ వైఎస్సార్ విగ్రహాలకు నివాళులర్పించి సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పార్టీ గురజాల పట్టణం, మండలం, దాచేపల్లి, మాచవరం మండల నేతల ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహాల వద్ద నివాళులర్పించారు. కేకులు కట్‌చేశారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి ఎనుముల మురళీధర్‌రెడ్డి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొమ్మినేని వెంకటేశ్వర్లు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.



చిలకలూరిపేటలో రక్తదాన శిబిరం నిర్వహించిన వైఎస్సార్ సీపీ నాయకులు



మాచర్లలో వైఎస్సార్ సీపీ శ్రేణుల భారీ ర్యాలీ



పెదకూరపాడు బస్టాండ్ సెంటర్‌లో మహానేత విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేస్తున్న నేతలు మీరయ్య, సాంబిరెడ్డి

కళాశాల స్థలం ఆక్రమణ ఆపాల్సిందే

మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి

పిడుగురాళ్ల: టీడీపీ నాయకులు పిడుగురాళ్ల పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్థలాన్ని ఆక్రమించి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసుకునేందుకు సిద్ధమయ్యారని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి మండిపడ్డారు. కాలేజీ ప్రాంగణంలో రోడ్డు వేసిన చోట మంగళవారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. టీడీపీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అండదండలతోనే ప్రభుత్వ జూనియర్ కాలేజీ స్థలంలో రోడ్లు వేసి ప్లాట్లు అమ్ముకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇక్కడ స్థలాన్ని కొనుగోలు చేసి ఎవరూ నష్టపోవద్దని చెప్పారు. సుమారు 44 సంవత్సరాల క్రితం అప్పటి పార్లమెంట్ సభ్యులు కాసు బ్రహ్మానందరెడ్డి ఈ ప్రాంతంలో ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఏర్పాటు చేశారన్నారు. పిడుగురాళ్లకు తలమానికంగా ఉన్న ప్రభుత్వ జూనియర్ కాలేజీని కూడా ఆక్రమిస్తున్నారని ఇటువంటి వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ ప్రాంతం అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో మెడికల్ కాలేజీ, నర్సింగ్ కాలేజీలు జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో తెచ్చామన్నారు. జూనియర్ కాలేజీ ప్రాంగణంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నిర్మించేందుకు అన్ని ప్రతిపాదనలు పూర్తిచేశామని తెలిపారు. సమావేశంలో పట్టణ, మండల కన్వీనర్లు మాదాల కిరణ్ కుమార్, చింతా సుబ్బారెడ్డి, మాజీ మండల కన్వీనర్ చల్లా పిచ్చిరెడ్డి, గార్లపాటి వెంకటేశ్వరరెడ్డి, మందా సుధీర్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాసు

సాగర్‌ను సందర్శించిన విదేశీయులు

విజయపురిసౌత్: పర్యావరణ పరిరక్షణ శిక్షణ, పరిశోధన సంస్థలో ఈ నెల 1వ తేదీ నుంచి 14 వరకు భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న 24 దేశాలకు చెందిన 37మంది మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. పర్యావరణ, అభివృద్ధి, నీటి సంరక్షణ తదితర అంశాలలో శిక్షణ పొందుతున్న వీరు సాగర్ జలాశయం, మెయిన్ డ్యాం, జల విద్యుదుత్పాదన కేంద్రం తదితర ప్రాంతాలను సందర్శించారు. సాగర్ ప్రాజెక్టు నిర్మాణం, జలవనరుల వినియోగం తదితర అంశాల గురించి సాగనీటి శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.



షరతులపై గుర్రు

- పేరెంట్స్ మీట్ షరతులపై విద్యాశాఖ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్న ఉపాధ్యాయ సంఘాలు
- ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసేలా కూటమి చర్యలు
- రేపు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో పేరెంట్స్, టీచర్స్ మీటింగ్

సత్తెనపల్లి: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న మెగా పేరెంట్ టీచర్స్ మీటింగ్ (పీటీఎం-2.0) కార్యక్రమ నిర్వహణపై విద్యా శాఖాధికారులు షరతులు విధించారు. ఆ రోజు ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభించి మధ్యాహ్నం 12:30 వరకూ జరుగుతుందీ లేనిదీ ఇతర శాఖల ఉద్యోగి పర్యవేక్షించాల్సి ఉంటుంది. ఆ ఉద్యోగి మెగా పీటీఎం రోజున 30 సెకన్ల వీడియో, నాలుగు ఫొటోలు, మొత్తం సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలి. ప్రధానోపాధ్యాయులు ఉపయోగిస్తున్న లీప్ యాప్‌లో సాక్షిగా వచ్చిన వ్యక్తి అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులకు విద్యాశాఖ అధికారులు షరతు విధించారు.

గురువులపై అదనపు భారం

జిల్లాలో మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, అన్ని మేనేజ్మెంట్ విద్యాసంస్థల్లో నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పల్నాడు జిల్లాలో 2,038 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 2,70,968 మంది విద్యార్థులు ఒకటి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్నారు. మెగా పీటీఎం కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులను పిలిచి విద్యార్థుల ప్రగతిని వివరించడం, వారికి అక్కడే మధ్యాహ్న భోజనం, క్రీడల నిర్వహణ, సమావేశం, అతిథుల ప్రసంగాలు, ఇలా ఉదయం 9 గంటల నుంచే వివిధ కార్యక్రమాలకు రూపకల్పన చేశారు. ఈ బాధ్యత, భారం అంతా ఉపాధ్యాయుల పైనే పడుతుంది. యోగాంధ్ర మాదిరి ఈ కార్యక్రమాన్ని రికార్డు స్థాయిలో గిన్నిస్ బుక్‌లో నమోదయ్యేలా నిర్వహించాలని ఒత్తిడి చేయడంతో ఉపాధ్యాయులు తలలు పట్టుకుంటున్నారు.



ఇతరుల పర్యవేక్షణ సరికాదు



మెగా పీటీఎంలో భాగంగా ఈ నెల 10న జరిగే సమావేశానికి ఇతర శాఖల ఉద్యోగుల పర్యవేక్షణ సరికాదు. గత పీటీఎంను విద్యార్థులు, తల్లిదండ్రులు, ప్రజల సహకారంతో విజయవంతం చేశాం. ఇప్పుడు బాహ్య పరిశీలకుల పేరిట ఇతర శాఖ ఉద్యోగులను నియమించడం పాఠశాల నిర్వహణ వ్యవస్థను, ఉపాధ్యాయుల పనితీరును కించపరచడమే.

– బంకా వాసుబాబు, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి, పల్నాడు

ఒత్తిడికి గురవుతున్న ఉపాధ్యాయులు



పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ప్రతి నెలా జరుగుతుండేవే. కానీ ఎప్పుడు లేని విధంగా అటు విద్యార్థులతో పాటు కార్యక్రమాలన్నీ క్షణాల్లోనే ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని ఉపాధ్యాయులను పరుగులు పెట్టిస్తున్నారు. దీంతో అదనపు కార్యక్రమాలతో ఉపాధ్యాయులు మరింత ఒత్తిడికి గురవుతున్నారు.

– ఎస్‌ఎం సుభాని, ఎస్టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

మాజీ మంత్రి అంబటికి పోలీసులు నోటీసులు

సత్తెనపల్లి: పోలీసుల విచారణకు హాజరు కావాలని వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి అంబటి రాంబాబుకు సత్తెనపల్లి రూరల్ పోలీసులు మంగళవారం నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నెల 18న పల్నాడు జిల్లా రెంటపాళ్ల పర్యటన సందర్భంగా పోలీసుల ఆంక్షలు ఉల్లంఘించారంటూ పలు సెక్షన్లతో విచారణకు హాజరు కావాలని కోరారు. నోటీసులు అందుకున్న మాజీ మంత్రి అంబటి రాంబాబు ఈనెల 11న సత్తెనపల్లి రూరల్ పోలీసులు ఎదుట విచారణకు హాజరు కానున్నారు.

పీ-4 తో పేదరికం నిర్మూలిద్దాం

జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి



నరసరావుపేట: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మానస పుత్రిక పీ-4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్ పార్టనర్ షిప్) కార్యక్రమం ద్వారా జిల్లాలో పేదరికం నిర్మూలనలో భాగమవుదామని జిల్లా ఇన్‌చార్జి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో స్వర్ణాంధ్ర జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ - స్మార్ట్ ఏపీ ఫౌండేషన్ జిల్లా చాప్టర్‌పై మంత్రి గొట్టిపాటి, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సమీక్ష నిర్వహించారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు, పారిశ్రామికవేత్తలు పీ4 కార్యక్రమంలో మార్గదర్శకులుగా నమోదు చేసుకుని ఆర్థికంగా వెనకబడిన వారిని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సహాయ సహకారం అందించాలన్నారు. చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు కన్నా లక్ష్మీనారాయణ, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, భాష్యం ప్రవీణ్, జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో మురళి, ఆర్డీవోలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక అంతరాలు రూపుమాపడమే లక్ష్యం..

ఆర్థిక అంతరాలను రూపుమాపి పేదరికం లేని సమాజం రూపొందించాలన్నదే పీ-4 కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పీ-4 ఉద్దేశ్యాలను తెలియజేశారు. ఆగష్టు 15 వ తేదీ లోపు బంగారు కుటుంబాలను ఆదుకునే చర్యలు చేపట్టాలన్నారు. జేసీ సూరజ్ గనోరే, సీపీఓ శ్రీనివాసమూర్తి, డీఆర్ఓ మురళి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



నరసరావుపేట: కేంద్ర ప్రభుత్వం రద్దు చేస్తున్న 44 చట్టాల్లో మున్సిపల్ కార్మికుల హక్కుల కోసం రూపొందించిన చట్టాలు సైతం రద్దు అయితే కార్మికులు సర్వసం కోల్పోతారని సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ సిలార్ మసూద్ పేర్కొన్నారు. తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట అర్ధనగ్నంగా నిరసన తెలిపారు. అనంతరం పట్టణ పురవీధుల్లో ప్రదర్శన చేశారు. జీతం పెంపుదల, సెలవులు, రక్షణకోసం జాగ్రత్తలు అడిగే హక్కు కోల్పోతారన్నారు. ఇప్పటికే సమానపనికి సమాన వేతనం ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పులు ఉన్నా ప్రభుత్వాలు అమలుచేయట్లేదన్నారు. కనీస వేతన చట్టం అమలుచేయాలని కోరారు. బుధవారం నిర్వహించే జాతీయ కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. అల్లాభక్షు, నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఆడుదాం ఆంధ్రాపై విజిలెన్స్ వివరాల సేకరణ

సత్తెనపల్లి: క్రీడాకారుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు గత ప్రభుత్వ హయాంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన ఆడుదాం ఆంధ్రాపై విజిలెన్స్ అధికారులు మంగళవారం వివరాలను సేకరించారు. విజిలెన్స్ రేంజ్ ఇన్‌స్పెక్టర్ షేక్ సైదులు నేతృత్వంలోని నలుగురు విజిలెన్స్ బృందం మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించి ఆర్వో అప్పారావు వద్ద వివరాలు కోరారు. ప్రత్యేకంగా ఒక ప్రొఫార్మా ఇచ్చి దాని ప్రకారం వివరాలు నింపాలని సూచించారు. పట్టణంతోపాటు మండలంలోని గ్రామ/వార్డు సచివాలయాల అడ్మిన్లు అందర్నీ మున్సిపల్ కార్యాలయానికి పిలిపించి వారి చేత ప్రొఫార్మా ఎలా పూర్తి చేయాలో సూచనలు చేశారు.

ప్రతిపక్షం కాదు...ప్రజాపక్షం

- బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ కార్యక్రమం
- కార్యకర్తలకు అండగా వైఎస్సార్‌సీపీ
- మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి



చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ క్యూఆర్ కోడ్ ఫ్లకార్డులను ప్రదర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి, నాయకులు

పిడుగురాళ్ల: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలోనూ ప్రజల పక్షాన నిరంతరం పోరాటం చేస్తుందని గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని భవనాశి కల్యాణ మండపంలో సోమవారం 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ మాదాల కిరణ్‌కుమార్ అధ్యక్షత వహించారు. మహేష్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామస్థాయిలో వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి విడుదల చేసిన చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తుచేస్తూ క్యూఆర్ కోడ్ విడుదల చేశారన్నారు. ఈ క్యూఆర్ కోడ్ గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సెల్‌ఫోన్‌లో స్కాన్ చేస్తూ చంద్రబాబు ఇచ్చిన హామీలు మొత్తం వస్తాయని, వాటిల్లో ఎన్ని హామీలు ప్రజలకు ఇచ్చాడో నేరుగా అడిగి తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు మోసపూరిత మేనిఫెస్టోను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. అనంతరం చంద్రబాబు మేనిఫెస్టోకు సంబంధించిన క్యూఆర్ కోడ్ వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రేపాల శ్రీనివాసరావు మాట్లాడుతూ క్యూఆర్ కోడ్‌తో బాబు మోసాలు బహిర్గతం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అదనపు ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడటానికి ముందుకు రావాలని సూచించారు. రాష్ట్ర అదనపు కార్యదర్శి మురళీధర్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ఒక్క హామీ కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేశారని అన్నారు. రాష్ట్ర జాయింట్ సెక్రటరీ కొమ్మినేని వెంకటేశ్వర్లు(కేవీ)మాట్లాడుతూ కార్యకర్తలందరు ఐక్యమత్యంతో ఉంటే తమపై ఎవ్వరూ దాడి చేయటానికి ముందుకు రారని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చింతా సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు అమరారెడ్డి, ముడేల వెంకటేశ్వరరెడ్డి, మద్దు ప్రసాద్, కొప్పుల సాంబయ్య, ఏలియా కుమారి, గురవారెడ్డి, మందా సుధీర్, వెంకటేశ్వరరెడ్డి, జూలకంటి శ్రీనివాసరావు, పోలు వీరారెడ్డి, యల్లారావు, షేక్ జైలాబ్దిన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

స్కూళ్ల వద్ద పోలీసులు సోదాలు



చిలకలూరిపేటటౌన్: పాఠశాలలు, కళాశాలల పరిసరాల్లో ఉన్న షాపుల్లో పోలీసులు మంగళవారం సోదాలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పట్టణం, రూరల్ మండలం పరిధిలోని పలు చోట్లు ఈ తనిఖీలు నిర్వహించారు. అర్బన్ సీఐ పి రమేష్ మాట్లాడుతూ యువత భవిష్యత్‌ను నాశనం చేసే మత్తు పదార్థాల వాడకాన్ని నిర్మూలించేందుకు ఈ తనిఖీలు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల సమీపంలో మత్తు పదార్థాలు అమ్మకాలు చేసినట్టయితే వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయనున్నట్లు హెచ్చరించారు.

ఎస్పీ కార్యాలయంలో ఉచిత వైద్య శిబిరం

నరసరావుపేట రూరల్: పోలీసుల ఆరోగ్యం సమాజ ఆరోగ్యానికి ప్రతిబింబం అని జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు అన్నారు. పోలీసులు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉన్నప్పుడే ప్రజలకు మరింత సమర్థవంతంగా సేవలు అందించగలరని అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం పోలీసులు సిబ్బందికి ఉచిత హెల్త్ చెకప్ క్యాంప్ నిర్వహించారు. మహాత్మాగాంధీ సూపర్‌స్పెషాలిటి హాస్పిటల్ వైద్యుల సహకారంతో నిర్వహించిన క్యాంప్‌లో 100మంది పోలీసు సిబ్బందికి వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు జరిపారు. బీపీ, కొలెస్ట్రాల్, షుగర్, ఈసీజీ, కిడ్నీ, లివర్ ఫంక్షన్ టెస్టులు వంటి కీలక పరీక్షలు నిర్వహించి సూచనలు చేశారు. జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 18వ తేదీ వరకు హెల్త్ చెకప్ క్యాంప్ జరుగుతుందని తెలిపారు. వృత్తిపరమైన ఒత్తిడి, నిద్రలేమి, అధిక శారీరక శ్రమ వంటి అంశాలు పోలీసు సిబ్బంది ఆరోగ్యాన్ని తీవ్ర ప్రభావితం చేస్తాయని తెలిపారు. దీనిని దృష్టిలో ఉంచుకొని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఆదేశాల మేరకు వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాలు భవిష్యత్‌లో కూడా నిరంతరాయంగా కొనసాగుతాయని వివరించారు. కార్యక్రమంలో పోలీసు శాఖ వైద్యురాలు డాక్టర్ ఎస్.వాసవి, మహాత్మాగాంధీ హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసు సిబ్బందికి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

కార్మికులకు తీరని ద్రోహం చేసిన కేంద్ర ప్రభుత్వం

- సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటూరు విజయ్‌కుమార్
- నేటి దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి



సత్తెనపల్లిలో బైక్ ర్యాలీలో సీఐటీయూ, ప్రజాసంఘాల నాయకులు

సత్తెనపల్లి: కార్మికులు పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కాలరాసి కార్మికులకు వ్యతిరేకంగా, యజమానులకు అనుకూలమైన 4 లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చి కార్మికులకు తీరని ద్రోహం చేసిందని సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యుడు గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. సత్తెనపల్లిలో సీఐటీయూ, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మంగళవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, పేదల వ్యతిరేక విధానాలను విడనాడాలని, రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని బుధవారం కేంద్ర కార్మిక సంఘాలు చేపట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ప్రజా సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే విధానాలను అనుసరిస్తూ ప్రజలపై భారాలను మోపుతుందన్నారు. పంటలకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం కూడా కేంద్రంలోని బీజేపీకి వత్తాసు పలుకుతూ అవే విధానాలు అమలు చేస్తుందన్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర కార్మిక సంఘాలన్నీ ఈనెల 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. ఈ సమ్మెలో కార్మిక, కర్షక, ఉద్యోగ, ఉపాధ్యాయ, అసంఘటిత రంగ కార్మికులు, స్కీం వర్కర్లు బడుగు బలహీన వర్గాలంతా పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం, కోపరేటివ్ బ్యాంక్, మార్కెట్ యార్డ్, యూనియన్ బ్యాంక్, అంగన్‌వాడీ కేంద్రాలు, కరూర్ వైశ్యా బ్యాంక్‌లను సందర్శించి కరపత్రాలు విస్తృతంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు జి.మల్లేశ్వరి, పెండ్యాల మహేష్, అవ్వారు ప్రసాద్‌రావు, ఏ ఆంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు కె దుర్గారావు, ఎ వీరబ్రహ్మం, జె రాజ్‌కుమార్, పి ప్రభాకర్, జి సుసలోన్, కె.జగన్, ఎం.రవికిరణ్, షేక్.మస్తాన్‌వలి, జి.యేసురత్నం, జి.మస్తాన్‌రావు, కె.సుధ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పోలీసుల బదిలీల్లో అవస్థలు

- గుంటూరు అర్బన్ నుంచి సుదూర ప్రాంతాలకు బదిలీలు
- తమకు న్యాయం చేయాలంటూ ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన



గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మహిళా పోలీసులు

నగరంపాలెం: గ్రామ, వార్డు సచివాలయాల బదిలీల ప్రక్రియ గందరగోళంగా మారిందని మహిళా పోలీసులు వాపోయారు. బదిలీల దరఖాస్తుల్లో ఐదు ఆప్షన్లకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ వందల కిలో మీటర్ల దూరం బదిలీలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు గుంటూరు జిల్లా పోలీస్ కార్యాలయం(డీపీఓ) ఎదుట మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. తమకు న్యాయం కావాలంటూ నినదించారు. గత నెల 28న గ్రామ, వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ మొదలైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలోని మహిళా పోలీసులు ఆయా డీపీఓల్లో దరఖాస్తులు చేసుకున్నారు. రెండు రోజుల క్రితం బదిలీల ప్రక్రియ ముగిసి, పోస్టింగ్‌లు కల్పించారు. ఒక్కసారిగా మహిళా పోలీసుల్లో ఆందోళన మొదలైంది. గుంటూరు అర్బన్ జిల్లాలోని వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తించే వారికి పల్నాడు, బాపట్ల జిల్లాలను కేటాయించారని వాపోయారు. కనీసం ఐదు ఆప్షన్లల్లో ఒకట్రెండు వాటికి దరఖాస్తులు చేసినా పట్టించుకోలేదని పలువురు వాపోయారు. ఏడు నెలల బాబు ఉన్నాడని దరఖాస్తులో తెలియజేసినా గుంటూరు అర్బన్ నుంచి మేడికొండూరు మండలం రూరల్‌కు బదిలీ చేశారని ఓ మహిళా పోలీస్ వాపోయింది. జిల్లా పోలీస్ ఉన్నతాధికారి అందుబాటులో లేరని చెప్పడంతో డీపీఓ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. దీంతో చంటి బిడ్డలతో వచ్చిన వారు సైతం వెనుదిరిగి వెళ్లారు.

112 కి.మీ. దూరం బదిలీ



గుంటూరు అర్బన్‌లోని ఓ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నా. పల్నాడు జిల్లా మాచర్ల మున్సిపల్ పరిధిలోని సచివాలయానికి బదిలీ చేశారు. గుంటూరు నుంచి కనీసం 112 కిలోమీటర్ల దూరం ఉంది. భర్త ఆర్మీలో ఉన్నారని, ఇద్దరు ఆడపిల్లలతో అక్కడకు వెళ్లాలంటే కష్టంగా ఉంటుంది. న్యాయం చేయగలరు.

– ఉషారాణి యడవల్లి, గుంటూరు అర్బన్.

ఆప్షన్ కూడా చూడలేదు



గుంటూరు అర్బన్ పరిధిలోని అడవితక్కెళ్ళపాడు సచివాలయం నుంచి మేడికొండూరు రూరల్‌కు బదిలీ చేశారు. దరఖాస్తులో ఏడు నెలల బాబు ఉన్నాడని విన్నవించాను. పట్టించుకోలేదు. చాలామంది ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యా సంవత్సరం మొదలై ఫీజులు చెల్లించిన తర్వాత సుదూర ప్రాంతాలకు బదిలీ తగదు.

– వై.నివేదిక, గుంటూరు అర్బన్.

ఒకే భూమిలో ఎన్నో సంపదలు

- ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపాలి
- ఆవులున్న రైతులకు రూ.50 వేలు ప్రభుత్వ ప్రోత్సాహకం



ఉన్నవలో రైతులతో మాట్లాడుతున్న ప్రకృతి వ్యవసాయ విభాగ డీపీఎం కె అమలకుమారి

యడ్లపాడు: ఒకే పంట కాకుండా పలు అంతర పంటలు వేసినట్లయితే భూమికి అవసరమైన సూక్ష్మపోషకాలు పెరిగి ప్రధాన పంట దిగుబడి మెరుగవుతుందని ప్రకృతి వ్యవసాయ విభాగం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె అమలకుమారి పేర్కొన్నారు. మంగళవారం యడ్లపాడు మండలం ఉన్నవ గ్రామంలో నిర్వహించిన ప్రకృతి వ్యవసాయ అవగాహన కార్యక్రమంలో పాల్గొన్నారు. స్థానిక రైతులు కుర్రా వేణు 22 ఎకరాల్లో సాగు చేస్తున్న 22 బహుళ పంటల్ని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రసాయనాల వాడకాన్ని పూర్తిగా మానేసి, కషాయాలతో సాగు చేసే ప్రకృతి వ్యవసాయ పద్ధతులు రైతులకు వివరించారు. అంతర పంటల ద్వారా రైతులకు పెట్టుబడి భారం తగ్గి అదనపు ఆదాయం కూడా లభిస్తుందన్నారు. మహిళా రైతు కోటేశ్వరమ్మ అభ్యసిస్తున్న ఏటీఎం మోడల్ వ్యవసాయం గురించి వివరించారు. ఈ విధానంలో రోజూ కూరగాయలు, ఆకుకూరలు, దుంపజాతి పంటలు పండించడం ద్వారా కుటుంబానికి ఆహార భద్రత కలుగుతుందని, ఇంకా రసాయన రహిత పద్ధతిలో పండిన ఉత్పత్తులకు ధరలు కూడా ఎక్కువగా లభిస్తాయని పేర్కొన్నారు. ప్రకృతి సాగు చేస్తున్న రైతులకు ఆవులు ఉండి అర్హులైతే ప్రభుత్వం రూ.50వేల ప్రోత్సాహకం అందిస్తుందని వెల్లడించారు. ఇందుకు రైతులు ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్‌లో పత్తి, వరి సాగు చేసే రైతులు ప్రకృతి పద్ధతులవైపు మొగ్గుచూపాలని సూచించారు. కార్యక్రమంలో కోటేశ్వరమ్మ, శ్రీనివాసరావు, పాములు సహా గ్రామ రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

గంజాయి స్వాధీనం

నెహ్రూనగర్: అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహాల వద్ద గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను గుంటూరు 2 ఎక్సైజ్ శాఖ అధికారులు అరెస్టు చేశారు. ఎక్సైజ్ సీఐ ఎం యశోధర దేవి తెలిపిన వివరాలు.. అడవితక్కెళ్లపాడుకు వెళ్లే రోడ్డులో చెరువు కట్ట వద్ద ఆటో నిలిపి గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్న గుంటూరువారితోటకు చెందిన షేక్ జాఫర్ అహ్మద్, కాకుమానువారితోటకు చెందిన పెట్లూరి సాహిద్, బొంగరాలబీడుకు చెందిన దాసరి సుమంత్‌లను అరెస్టు చేశామన్నారు. వారి వద్ద నుంచి 456 గ్రాముల గంజాయిని, ఒక ఆటో, 3 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. నగరానికి చెందిన ఈశ్వర్ వద్ద నుంచి వీరు గంజాయి కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. అతని కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు సీహెచ్ మాధవి, పీఆర్‌కె మూర్తి పాల్గొన్నారు.

గంజాయి వినియోగిస్తున్న వ్యక్తులకు కౌన్సెలింగ్

నగర శివారు ప్రాంతాల్లో గంజాయి వినియోగిస్తున్న వ్యక్తులను గుంటూరు 2 ఎక్సైజ్ స్టేషన్‌కు అధికారులు పిలిపించారు. వారి తల్లిదండ్రులకు ఫోన్‌చేసి పిలిపించి మరీ సీఐ యశోధరదేవి కౌన్సెలింగ్ నిర్వహించారు.

పెన్షన్ భిక్ష కాదు... హక్కు

లక్ష్మీపురం: గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. వృద్ధాప్య పెన్షన్, తెల్ల రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ వంటి పథకాలు ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్‌కి కూడా వర్తింపజేయాలని జిల్లా సీఐటీయూ ప్రధానకార్యదర్శి దండా లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కలెక్టరేట్ ముందు ధర్నాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పని గంటలు పెంచుతూ చట్టం తీసుకొచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను ఖండించారు. బుధవారం జరిగే సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. యూనియన్ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ కె.గంగాధరరావు మాట్లాడారు.

అదృశ్యం కేసులో పది మంది ఆచూకీ గుర్తింపు



అదృశ్యమైన, మహిళలు, చిన్నారులను కుటుంబ సభ్యులకు అప్పగించిన పట్టాభిపురం సీఐ

లక్ష్మీపురం: ఈ నెల 2వ తేదీన కొబాల్డ్‌పేటలో ముగ్గురు మహిళలు, ఏడుగురు చిన్నారులు అదృశ్యం అయిన కేసును పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు ఛేదించారు. వారిని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పట్టాభిపురం సీఐ తెలిపిన వివరాల ప్రకారం... కొబాల్డ్‌పేట 6వ లైనులో నివాసం ఉండే సయ్యద్ సందానీకి, అతని భార్య కరీమూన్‌కు కొంత కాలంగా చిన్న గొడవలు జరుగుతున్నాయి. అదే భవనంలో పై పోర్షన్‌లో నివాసం ఉండే షేక్ చిన్న బాజీకి, ఆమె భార్య రజియాకు కూడా మనస్పర్థలు ఉన్నాయి రజియా చెల్లెలు సైదాబీకూడా తన భర్తతో గొడవల కారణంగా వచ్చి వీరి వద్దనే తన కుమార్తెతో ఉంటోంది. కరీమూన్, రజియా, సైదాబీలు ఎక్కడికైనా వెళ్లి పని చేసుకోవాలని నిర్ణయించుకుని ఈ నెల 2వ తేదీన బయలుదేరారు. కరీమూన్ తన ముగ్గురు మగ పిల్లలను, రజియా తన ముగ్గురు పిల్లలను, సైదాబీ తన కుమార్తెను వెంట బెట్టుకుని వెళ్లిపోయారు. కుటుంబసభ్యులు పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు ప్రారంభించారు. వీరి కోసం ప్రత్యేక బృందాన్ని కేటాయించారు. సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తన సిబ్బందితో ఏఎస్సై ఆంటోని, హెడ్ కానిస్టేబుల్ ప్రసాదరావు, కోటేశ్వరరావు, నరసింహారావు, మాణిక్యరావుల సహాయంతో హైదరాబాద్ చర్లపల్లి ప్రాంతంలో వీరు ఉన్నట్లు గుర్తించారు. వారిని పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ తర్వాత కుటుంబసభ్యులకు అప్పగించారు.

జిల్లా అభివృద్ధికి చర్యలు తీసుకుంటాం

– ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్

గుంటూరు వెస్ట్: జిల్లాను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో మంత్రితోపాటు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెని క్రిస్టినా, రాజ్యసభ సభ్యులు ఆళ్ల అయోధ్యరామిరెడ్డి, శాసనమండలి సభ్యులు చంద్రగిరి ఏసురత్నం, మురుగుడు హనుమంతరావు, ఎమ్మెల్యేలు గల్లా మాధవి, మొహమ్మద్ నసీర్ అహ్మద్, ధూళిపాళ్ల నరేంద్రకుమార్, తెనాలి శ్రావణ్ కుమార్, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సింహ, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం లేని సమాజాన్ని నెలకొల్పేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. సమావేశంలో జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు, బీసీఎంఎస్ చైర్మన్ వడ్రాణం హరిబాబు, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీవో కె.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో కొరవడిన సమన్వయం

జిల్లా సమీక్షా సమావేశంలో సమన్వయం లేకుండా పోయింది. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు మధ్య ఎక్కడా సమన్వయం లేకపోవడం గమనార్హం. సమావేశంలో తల్లికి వందనంపై చర్చ జరిగేటప్పుడు పూర్తి వివరాలు డీఈఓ రేణుక వెల్లడించలేకపోయారు. దీంతో శాసనసభ్యుడు ధూళిపాళ్ళ నరేంద్ర, తెనాలి శ్రావణ్ కుమార్‌లు నిలదీశారు. కొందరికి రూ.13 వేలు, మరికొందరికి రూ.10 వేలు ఎందుకు పడుతున్నాయని శాసన సభ్యులు ప్రశ్నించగా అధికారుల వద్ద సమాధానం కరువైంది. గ్రామాల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోతున్నామని వెల్లడించారు. అర్హత ఉన్నప్పటికీ ఎందుకు నగదు జమ చేయలేదని నిలదీశారు. కలెక్టర్ సర్దిచెప్పే ప్రయత్నం చేశారు. దీంతోపాటు సీసీఆర్సీ కార్డులతోపాటు కౌలు రైతులకు రుణాలు లక్ష్యాల మేరకు ఎందుకివ్వలేదని ప్రశ్నించినప్పుడు కూడా పర్యవేక్షిస్తున్నామని అధికారులు దాటవేత ధోరణిలో బదులిచ్చారు. ఇక పీ4 విషయానికి వస్తే మరీ దారుణంగా వ్యవహరించారు. జిల్లాలో గుంటూరు తూర్పు నియోజకవర్గానికి 17,050, పశ్చిమకు 14,757, మంగళగిరికి 9,968, పొన్నూరుకు 9,632, ప్రత్తిపాడుకు 6,700, తెనాలికి 11,173 మందిని ఆదుకోవాలని లక్ష్యాలుగా నిర్ణయిస్తే ఒక్కరు కూడా ఎంత మందికి న్యాయం చేశామో చెప్పలేదు. ఇంకా పూర్తి స్థాయి మార్గదర్శకాలు రూపొందించలేదని తెలిసింది. ఈ సమావేశానికి కూడా మంగళగిరి శాసన సభ్యులు, మంత్రి నారా లోకేష్ హాజరు కాలేదు. ఆయనతోపాటు ప్రత్తిపాడు శాసనసభ్యుడు బూర్ల రామాంజనేయులు, తెనాలి శాసన సభ్యుడైన మంత్రి నాదెండ్ల మనోహర్‌లు రాలేదు.